# వెధవ డబ్బు

## పాలంకి వెంకటరామచంద్రమూర్తి

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1950వ దశకంలో ప్రచురించాము

"ఆ అమ్మాయికి పదహారేళ్లుండవచ్చు. అతగాడికి ఇరవై కంటే ఎక్కువ ఉండవు. 'ఈడూ జోడూ' ఐన దాంపత్యం వాళ్లది. వాళ్లిద్దరూ సాయంకాలం షికారుగా వీధినిపడి పోతున్నారు. ఏవేవో చెప్పుకుంటున్నారు. కిలకిల నవ్వుకుంటున్నారు. తమ మాటలెవరైనా వింటున్నారేమో అన్న సంకోచం కాని, భయం కాని లేనేలేవు వాళ్లకి.

వాళ్ల మాటలు వెనకాల నడిచివస్తోన్న కనకాచలానికి వినబడుతూనే ఉన్నాయి. ఆ వృద్ధుడు ఆ జంటకొక పదిఅడుగుల వెనకాల గాలివాలున ఉన్నాడు.

'చూశావా, వాళ్లెంత హాయిగా ఉన్నారో! ప్రథమయవ్వనం తొణికిసలాడుతోన్నప్పుడే హాయి! నీకేముందింక? ఏళ్లు నిండిన తొక్కువి! యముడు పంపే టెలిగ్రాముకి ఎదురు చూస్తున్నావు. ఈలోగా ఎంత దక్కితే అంతే అని వాళ్ల పలుకులు విని ఆనందించు!' అంటూ గాలిదేవుడు ఆ నూత్నదంపతుల సంభాషణంతా తెచ్చి ఆ ముసిలాయన చెవులకు ఒప్పగించాడు.

ఆ జంట సందు వదలి రాజవీథిని ప్రవేశించారు. కుడివైపున ఫర్నిచరు కంపెనీ షోరూము కనపడింది. అద్దాల వెనకాల స్ప్రింగ్ మంచం, దాని మీద కుషనూ, రకరకాల సోఫాలూ, కుషన్లూ కనపడి ఆకర్షించాయి. ఆ పడక గది ఫర్నిచరు సెట్టు అంతా "రూ. 1216/" అని అట్టముక్కపై వెల వేసి ఉంది.

"విత్తం కొద్దీ వైభవం" అంది అమ్మాయి.

"మీవాళ్లు కొనివ్వకూడదూ పోనీ?" అన్నాడతడు ఛలోక్తిగా.

ఆమెకు కొంచెం కోపం వచ్చి ముఖం ఎర్రబడింది.

అతగాడే మళ్లీ, "ఎందుకూ, ఎప్పటికైనా నాకొక పెద్ద ఉద్యోగం కాకపోతుంది గనుకనా? అప్పుడు నేనే కొంటాను!" అన్నాడు.

కనకాచలంగారు, అతడామెకు కోపం రప్పించడం, అంతలోనే సమాధానపరచటం చూసి పొంగిపోయాడు. 'చిలకా గోరింకలకు మల్లే ఉన్నారర్రా! చిట్టి చిట్టి తగాయిదాలూ, రాజీనామాలూను! పాపం, మీకా స్ప్రింగు సామానుమీద మనసుపోయింది కదూ? పెద్ద ఉద్యోగం వస్తే కొంటానంటున్నాడు వెర్రినాయన! ఇప్పుడేదో చిన్న నౌకరీయే అన్నమాట. వీళ్ల మనసు ఎప్పుడైనా తీరుతుందా? పోనీ, నేను ఆ 1216 రూపాయలూ ఇచ్చి, 'కొనుక్కోండర్రా!' అంటే ఎలాగుంటుంది? నాకు బ్యాంకులో లక్షలకొద్దీ డబ్బు మూలుగుతోందాయిరి. ఏం చేసుకోనూ వెధవ డబ్బు? నా అనంతరం తినడానికి ఎవళ్లో లేకపోలేదు. ఐతేం, ఈ పిన్నదంపతులెవళ్లో నాకు తెలవకపోయినా, వీళ్ల ఆ కాస్త మనసూ నేను తీరుస్తే వీళ్లెంతో ఆనందిస్తారు. 'ఎవరీయన? మన ముక్కూ మొహం ఎరక్కపోయినా వెనకాలే వస్తూ మన కోరిక విని తథాస్తు దేవతకు మల్లే ఇట్టే తీర్చేశాడు!' అని ఆశ్చర్యపోతారు. భలే గమ్మత్తుగా ఉంటుందప్పుడు!' అంటూ కనకాచలంగారు ఆ దంపతులను ఆపబోయాడు. కానీ వెంటనే ఆయన ఆలోచన మరొక ఫక్కీని వెళ్లింది. 'వీళ్లు కష్టార్జితమైన సొమ్ముతో ఈ సామాను కొనుక్కున్నప్పుడు కలిగే ఆనందం నా మూలాన ఇలా తేరగా వచ్చిపడితే కలగదు. నా సరదాకొద్దీ వీళ్లకు డబ్బు ఇచ్చి వీళ్లంతట వీళ్లు సంపాదించుకోవలసిన సంతోషాన్ని మనం చెడగొట్టకూడదు!' అంటూ తన ఉద్దేశం మార్చుకున్నాడు.

ఆ మిథునం ముందుకు సాగారు. వాళ్లకెదురుగా ఒక నావికుల గుంపు వచ్చింది.

"ఎవళ్లండీ వీళ్లు? వీళ్ల డ్రెస్సంతా అదోరకంగా ఉంది!" అన్నదామె.

"వీళ్లు నావికులు. ఓడల మీద యుద్ధం చేసేవాళ్లు" అన్నాడతడు.

వాళ్ల సంభాషణ ఓడలమీదకీ, సముద్రం అవతల ఉండే దేశాలమీదికీ, ద్వీపాలమీదికీ పోయింది.

"మొన్న సినిమాలో చూసిన ద్వీపమేదో బాగుంది కదండీ? ఆ కొబ్బరితోటలూ, కోతులూ, ఆ కోతులు కథలోని ఆ ప్రేమికులకు కొబ్బరికాయలు పడెయ్యటం చాలా తమాషాగా ఉంది!" అన్నదామె. "ఔను. ద్వీపాలను 'సౌత్ సీ ఐలెండ్లు' అంటారు. వినోదంగా గడపటానికి అక్కడికి ఓడలమీద దేశదేశాల నుంచి వెడుతోంటారు. తెల్లవాళ్లు కొత్తగా పెళ్లి చేసుకున్నప్పుడు ఎవళ్ల జోక్యం లేకుండా స్వేచ్ఛగా ఉండటానికని ఇలాంటి ద్వీపాలకు

పోయి కొన్నాళ్లక్కడ గడిపివస్తారు. దాన్నే వాళ్లు 'హనీమూన్' అంటారు!" అన్నాడతడు.

"మనం కూడా అలా ఏ దీవికైనా వెడితేనో హాయిగా!" అన్నదామె.

"నాకూ అలాగే ఉంది మరి. కానీ, డబ్బో? ఓడమీద ప్రయాణమంటే బోలెడు డబ్బు కావాలి!" అన్నాడతడు.

ఇదంతా కనకాచలంగారి చెవిని పడుతోనే ఉంది. 'మీకంటే 'బోలెడు' అనిపిస్తోంది కానీ ఆ సొమ్ము నాకొక లెక్కలోది కాదర్రా, వెర్రిపిల్లల్లారా! మీకు ఒక ఓడలో మొదటి తరగతి టిక్కెట్లు కొని ఇచ్చి మీ ప్రయాణం సుఖంగా ఉండేటట్లు ఏర్పాటు చేయగలను... కానీ ఓడలో మొదటి తరగతి ప్రయాణికులు ఎలాగ ప్రవర్తించాలో, ఆ పద్ధతులూ, పంపిణీలూ మీకు తెలుసా మరి! ఇప్పుడంటే పట్నం వచ్చారుకానీ, మీరు ఏదో ఒక పల్లెలో పుట్టి పెరిగినవాళ్లయుంటారు. అలాంటప్పుడు మిమ్మల్ని తీసుకుపోయి ఒక గొప్ప స్టీమరులో ఫస్టుక్లాసు పాసెంజర్ల మధ్య పడేస్తే వాళ్లంతా మిమ్మల్ని 'బైతులు' అని హేళన చేస్తారు. మీకు సంతోషం కలిగిద్దామని పూనుకుంటే చిగురికి మీ కది చెఱ ఐ ఊరుకుంటుంది! మొదటి తరగతికన్న రెండవ తరగతి మేలేమో?... అలాగా అనటానికీ వీల్లేదు. కొంచెం తేడాగానీ, ఆ రెండు తరగతుల మధ్యా అట్టే భేదం లేదు. మూడవ తరగతే మీలాంటి వాళ్లకి సరిపడుతుంది... కానీ మూడవ తరగతి బొత్తిగా అన్యాయమేమో? రంగం, మోల్మెయిసూ కూలికోసం వెళ్లే అలగాజనమంతా మూడవ తరగతిలో ఎక్కి వెడుతోంటే చూశానుగా? దానికన్న నరకం వేరేవు ఉండదు. ఈ నూత్నదంపతులను సుఖంగా, హాయిగ్గా ఇంటిపట్ల ఉండనివ్వక, ఏం పాముకుంటారనీ ఓడమీద పంపటం?' ఇలా అనుకొని కనకాచలం ఆ పాపానికి వొడికట్టుకోవడం మానుకున్నాడు.

ఆ వృద్ధధనికుడి నిశ్చయాని కొచ్చేలోగా ఆ దంపతులేదో మరో గొడవలో పడ్డారు. ఆ కొత్త కోరిక ఏమిటో ఆయన చెవిలో పడలేదు కానీ, అదీ డబ్బుమీద ఆధారపడివున్నదే అని తేలింది.

ఏమంటే ఆ యువకుడు తన పడుచుతో, "అంతా డబ్బుతో ఉందనుకో. 'ధనమూల మిదం జగత్!' అని ఊరికే అన్నారా మరి?" అన్నాడు.

"ఔను. అందుకేగా నేను 'విత్తం కొద్దీ వైభవం' అంటా? డబ్బు లేనివాడికి ప్రతిదీ అందని మ్రానిపండే. డబ్బు ఉంటే ఏ సుఖమైనా అరచేతిలో వెన్నముద్ద!" అని భర్తతో

## ఇంటర్నెట్‌లో క్రోక్విల్ క్లబ్

రమదా హోటల్‌లో ఇటీవల అంతర్జాతీయ కార్టూనిస్టుల దినోత్సవాన్ని జరుపుకున్న క్రోక్విల్ క్లబ్ ఇంటర్నేషనల్‌వారు ప్రముఖ కార్టూనిస్టు బి.వి. సత్యమూర్తిని, సంస్థ కొత్తఅధ్యక్షుడుగా ఎన్నికైన డాక్టర్ జయదేవ్‌బాబును సత్కరించారు. ప్రముఖ చిత్రకారుడు శ్రీ బాపు మాట్లాడుతూ, "క్లబ్బు కార్యక్రమాలగురించి క్రోక్విల్ క్లబ్ డాట్ కామ్‌లో ఇంటర్నెట్‌లో తెలుసుకోవచ్చుని, దేశంలోని ప్రముఖ కార్టూనిస్టులగురించి దూరదర్శన్ నేషనల్ నెట్‌వర్క్‌లో ఒక కార్యక్రమం ప్రతి ఆదివారం మూడుగంటలకు ప్రసారమవుతుందని, క్లబ్ మీటింగులు ప్రతి మూడునెలల కొకసారి హైదరాబాదులో జరుగుతా"యని చెప్పారు.

ఏకీభవించిందామె.

కానీ కనకాచలం, 'ఎంత అమాయకుల్రా మీ రిద్దరూను! డబ్బు సుఖాన్ని కూరుస్తుందిట్రా వెర్రిమొహాల్లారా? నూరు రూపాయల పెట్టుబడితో వ్యాపారం మొదలెట్టిన నాకు ఇప్పుడు కొన్ని లక్షలు మూలుగుతున్నాయి. నేనేం సుఖపడ్డాను? ధనాన్ని గురించి మీరిద్దరూ ఇప్పుడు వెల్లడి చేసిన ఆ అభిప్రాయం శుద్ధ పొరపాటని నిరూపించటానికి నాకెంతోసేపు పట్టదు. ఎందుకూ? ఒక్క పదివేల రూపాయలు తెచ్చి మీ చేతిలో పోస్తే సరి, ఆ డబ్బు మూలాన ఎన్నెన్ని కీడులు మూడుతాయో మీకే తెలిసొస్తుంది! లేకుంటే కలిగే దుఃఖం కన్నా, ఉంటే ఉన్న దుఃఖం ఎక్కువర్రా కుర్రవాళ్లల్లారా! 'డబ్బో డబ్బో' అంటూన్నారు, వెధవ డబ్బు! డబ్బు చేరితే సుఖంగా నిద్ర కూడా పట్టదు తెలుసా? ఆ పదివేలూ ఇచ్చి మీ సుఖనిద్ర చెడగొట్టమంటారా నన్ను. చెప్పండి... ఊహూఁ. నేనా పాపపుపని చెయ్యను! మానససరోవరంలోని హంసలకుమల్లే హాయిగా ఆనందంలో తేలిపోతున్నారు మీరిప్పుడు. ఇలాగే ఉండండి. డబ్బు లేదని విచారించకండి, వెధవడబ్బు!' అని దాన్ని శపిస్తో, చేయబోయిన ఆ వాగ్దానం రొంతా ఉపసంహరించుకున్నాడు.

ఆమె చేతిలోంచి రుమాలు జారి క్రిందపడింది. ఆమె తీసుకుందామని వెనక్కి తిరిగింది. ఆ లోగానే ఆ యువకుడు వంగి దాన్ని తీసి ఆమెకెంతో సొగసుగా అందించాడు. ఆ చిరునవ్వు మొహంలోని సోయగాన్ని చూసి ఆమె, 'ఎంత అందగాడు!' అనుకుంది.

బఠానీలూ, వేయించిన వేరుసెనగ పలుకులూ జంగెడలో పోసి అమ్మదెస్తూ ఒకడు ఎదురయ్యాడు.

యువకుడు అణా వేరుసెనగలూ, అణా బఠానీలూ కొని ఆమె రుమాలులో పోశాడు. జంగెడవాని చేతిలో అర్ధరూపాయి నాణెం పడేసి మిగతా చిల్లరకై నడుస్తోనే చేయి చాపాడు. జంగెడవాడు చిల్లర ఇచ్చి ముందుకు పోవడంలో దానిలోని ఐదు నయాపైసల కాసొకటి యువకుని చేతిలోగాక క్రిందపడిపోయింది.

"ఏమిటి, వెతుకుతున్నారు?" అన్నది పడుచు.

"ఐదు నయాపైసల నాణెం ఎక్కడో పడింది."

"పోనిద్దురూ, ఐదు నయాపైసలే కదా? ఏ ముష్టివానికో దొరికి సంతోషిస్తాడు!" అని ముందుకు నడిచింది. అతడూ ఆమె ననుసరించి నడిచాడు.

ఆ వెనకాల ఇంకా వస్తున్న కనకాచలానికి ఆ ఐదు నయాపైసల నాణెం కనపడింది. అతడు వెంటనే దాన్ని తీసుకుని కళ్లకు అద్దుకుని జేబులో వేసుకున్నాడు! ■

